

# భవానీద్వీపం

## –వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 23 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

ఇప్పుడు మంచు తెరలు పూర్తిగా తొలిగిపోయాయి. కొండనిండా పరచుకున్న గండశిలలతో, నానాజాతుల భారీ వృక్షాలతో గంభీరముగా కనిపిస్తున్నది స్థంభాద్రి. కొండపాదమువద్ద తనకై ఎదురుచూస్తున్న అర్చకస్వాములవద్దకు చేరుకున్నాడు సమర్ధరాముడు. పెద్ద వెండిపళ్ళెములో నూతనవస్త్రముతో ఆచ్ఛాదితమైన కలశమును కుడిచేతిలో ధరించి అంతవరకూ జరుగుతున్నదంతా గమనిస్తున్నారు అర్చకస్వామి.

గజలక్ష్మి, స్వస్తిక చిహ్నములు చిత్రించిన మృత్తికతోచేసిన కలశములో నారికేళము, మామిడాకులు అందముగా అమర్చబడివున్నాయి. కలశముయొక్క కంఠానికి మామిడాకుల తోరము శోభలు కలిగిస్తున్నది. కలశమునిండా స్వచ్ఛమైన నీరు ఉన్నది. చేతిదూరములో ఆయన వెనుకే అనుసరించి వస్తున్నాడు కృష్ణరాయలు. కృష్ణోబా అన్న పిలుపుకు ఆయనను సమీపించాడు.

చిరునవ్వుతో తన ధనుస్సును, మూపున ఉన్న అమ్ములపొదిని రాయలకు అందించాడు సమర్ధరాముడు. సంభ్రమము, ఆనందము కలగలిసిన ఉద్విగ్నతతో వాటినివినయముగా అందుకున్నాడు కృష్ణరాయలు. అమ్ములపొదిని తన మూపున చేర్చుకున్నాడు.

ధనుస్సును తన ఎడమచేత ధరించాడు. సమర్ధరాముడి పాదుకలను తన శిరసున ధరించాడు.

సమర్ధరాముడికి పన్నీరు చిలికించి, పుష్పమాలతో అలంకరించి, పరివట్టాన్ని కట్టబెట్టాడు అర్చకస్వామి.'న కర్మణా న ప్రజయా ధనేన' అనే కృష్ణయజుర్వేదాంతర్గత మహానారాయణోపనిషత్తులోని పవిత్రమంత్రాలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికాడు. తను ముందుగా మెట్లమీదుగా దారితీశారు అర్చకస్వామి. జోడించిన చేతులతో, అర్ధనిమీలిత నేత్రాలతో మందగమనంతో అనుసరించాడు సమర్ధరాముడు. ఆ వెనుక కృష్ణరాయలు, మిగిలినవారు అనుసరించారు.మెట్లప్రక్కగా గంతులువేస్తూ అనుసరించింది రాంబోలా.

రాతి తోరణముగుండా ధ్వజస్థంభము వద్దకు చేరుకున్నారు. నాలుగు ప్రక్కలా ఆకాశానికి అంటుతున్నట్లున్న కొండ. ప్రశాంతమైన ఉదయపు గాలులు వీస్తున్నాయి. కొండనిండా విరిసిన పూవుల సువాసనలను మోసుకొస్తున్నాయి.

'ఈ సమీపంలోనే ఉన్న కొణిజెర్ల గ్రామంలో ఒక పుణ్యాత్మురాలు ఉండేది స్వామీ! ఆమె తన పశువులను మేపుకుంటూ కొండ ఎక్కిందిట ఒకరోజు. ఇక్కడికి వచ్చేప్పటికి భయంకరమైన సింహ గర్జనలు వినిపించాయిట!' వందల మెట్లెక్కిన ఆయాసాన్ని ఆపుకునే ప్రయత్నం చేస్తూ స్థంభాద్రి నృసింహుని కథను చెప్పడం మొదలెట్టాడు అర్చకస్వామి.

మెడలో పూలమాల, తలకు చుట్టిన పరివట్టము వింతశోభలు వెలువరిస్తుంటే మెరుపు నిండిన కనులతో వింటున్నాడు సమర్ధరాముడు. చుట్టూ వందల అడుగుల ఎత్తునున్న గంభీరమైన కొండ పులకించి వింటున్నట్టుగా మధురమైన మౌనం నెలకొని ఉన్నది. అర్చకస్వామి కొనసాగించాడు. ' ఆ తరువాత కొన్ని రోజులు ఆమె ఈ ప్రాంతానికి రాలేదు. కలలో ఒక వింత సింహం కనిపించడం మొదలైంది ఆమెకు. గర్జనలతో సింహంలా కనిపించి, సగం మనిషిలా సగం సింహంలా కనిపించి, చివరకు ఒక దివ్య తేజస్సు ప్రత్యక్షమై మెలకువ వచ్చేదిట'

'పుణ్యాత్మురాలు!' అన్నాడు సమర్ధుడు. ఆయన చెక్కిళ్ళ మీద ఆనందపు చెమ్మ మెరుస్తున్నది. కొన్నిరోజులు అలానే స్వప్నం వచ్చిన తరువాత ఒక ఎరుకలసాని వంటిమీదకు నరసింహుడు పూని ఆమెను ఈ కొండకు రమ్మని చెప్పాట్ట! మర్నాడు శుచిగా ఆమె కొండనెక్కి ఇక్కడకు వచ్చేప్పటికి అదిగో, అక్కడినుండి సింహగర్జనలు వస్తున్నట్టు గమనించింది! ఆలయ సింహద్వారంవైపు చూపిస్తూ అటు అడుగులేశాడు అర్చకస్వామి.

ఇంతలో ఒక్కసారిగా గంపలనిండా కర్పూరపు రాశులు గుమ్మరించినట్లు దివ్యపరిమళం ఆ ప్రాంతాన్ని నింపేసింది. సింహద్వారంగుండా లోపలకు వెళ్ళబోతున్న అర్చకస్వామి తొట్రుపాటుతో వెనుకకు దూకినంతపని చేశాడు. ఆయన రెండుచేతులలో పొదివి పట్టుకున్న వెండి పళ్ళేరం కంపిస్తున్నట్లుగా పళ్ళెం మధ్యనున్న పూర్ణ కలశం అటూ యిటూ ఊగిసలాడుతున్నది. గగుర్పాటుతో 'ఆస్తీక! ఆస్తీక! ఆస్తీక!' అంటూ పెద్దగా ఉచ్చరించడం మొదలెట్టాడు!

పాఠకుడా! ఆ దివ్య సన్నివేశానికి నేను సాక్షిని! ద్రష్టను! నమ్ముతావా, నీది అదృష్టం! యుగాల పర్యంతం ఎన్ని చూశాను! ఎన్ని కన్నీళ్లు! ఎన్ని ఆనందపు ఆనవాళ్ళు! యిప్పటికీ నాకు గుర్తే! యిప్పుడే నా కళ్ళముందే జరుగుతున్నది అన్నంత స్పష్టంగా నా మస్తిష్కపు తెరమీద మనోనేత్రంతో చూస్తున్నాను మరలా! వినిపిస్తున్నాను! విని తరిస్తావో, తత్త్వం గ్రహిస్తావో, తృణీకరిస్తావో, విశృంఖలంగా చరిస్తావో నీ ప్రాప్తం! నీ స్వేచ్ఛ!

రాతిని తొలిచి చేసిన సింహద్వారం గుండా వస్తున్నది ఆ కర్పూరపు వాసన! పరిమళపు వరద పోటెత్తినట్లుగా మత్తులో ముంచెత్తే ఘాటైన సువాసన అది! శరీరాలు చల్లబడిపోయాయి అందరికీ! పాల నురగ ప్రవహించి వస్తున్నట్లుగా సింహద్వారం లోనుండి నెమ్మదిగా శిరస్సును బయటకు పెట్టి, నిదానంగా వస్తున్నది ఒక తెల్లని మహాసర్పం! దివ్యసర్పం! మధ్య మధ్య నెమ్మదిగా తలనెత్తి బరువైన తెరచాపలాంటి విశాలమైన పడగను విప్పుతూ వస్తున్నది. వస్తూనే ఉన్నది. తలనెత్తి పూర్తిగా విప్పినపుడు నాలుగుమూరల సింహద్వారానికి సరిపోతున్నది ఆ పడగ. ఎనిమిది మూరల పొడవు బయటకు వచ్చినపుడు కంఠం వరకే కనిపించింది. అరఘడియ కాలంవరకూ నిదానముగా పాకుతూ పద్దెనిమిది మూరల పొడవైన ఆ మహా శ్వేతసర్పం పూర్తిగా బయటకు వచ్చింది!

పాకుతున్నపుడు తెల్లని గొలుసులు మౌనంగా కదులుతున్నట్లు పొలుసులు కదులుతూ మెరుస్తున్నాయి. ఎంతవయసున్నదో తెలియని వృద్ధ సర్పం అది. అరచేతి వెడల్పున ఉన్న నీలి కనుగుడ్ల అంచులకు కమ్ముకున్న పచ్చని పొర గగుర్పాటు కలిగిస్తున్నది.

వెనక్కు వెనక్కు అడుగులువేస్తూ సమీపంలో లేకుండా వెళ్ళిపోయారు అందరూ. పాఠకుడా! ఆ మహానుభావుడు సమర్ధరాముడు ఒక్క అడుగూ కదపలేదు. ఆ వదనంలో ప్రసన్నత చెదిరిపోలేదు! అల్లంతదూరంనుండి వస్తున్న అమ్మను చూసిన బిడ్డలా సంబరపడ్డట్లు కనిపించాడు! కనులు మిరుమిట్లు గొలిపే తెలుపు వర్ణం మీద బంగారు రంగుల పొలుసులు మిలమిల లాడుతున్నాయి ఆ మహాసర్పం పాకుతుంటే. పాకుతున్నపుడు బారెడు

ప్రమాణము ఉన్న తలమీద చిక్కని ఊదారంగు పాదముల గుర్తులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పడగవిప్పినపుడు తలమీద పెద్ద బంతిలా గడ్డుకట్టినట్లు ఉబ్బి కనిపిస్తున్నది. కమిలినట్లు నీలిరంగులో ఉన్నది. దివ్యమైన మణి అది. ఎన్నివేల సంవత్సరాల వయసుతోనో పడగలో పెరిగిన నాగమణి అది. సింహద్వారం బయటకు వచ్చి తలను పూర్తిగా ఎత్తి పడగవిప్పి కొన్ని నిముషాలపాటు పరికించి చూసింది.

కదలకుండా తొణకకుండా సమాధిలో ఉన్నట్లు అర్ధ నిమీలిత నేత్రాలతో శాంతంగా చూస్తున్నాడు సమర్ధ రాముడు. ఆయన కుడిచేతివైపు పాకుతూ ప్రదక్షిణగా ఆయనను మూడున్నర చుట్లు చుట్టి పూర్తిగా తలెత్తి పడగవిప్పి ఆయననే చూస్తూ ఉండిపోయింది పరిశీలిస్తున్నట్లు. ఎప్పటి పాత స్నేహితుడినో చూస్తున్నట్లు, ఎదిగిన బిడ్డను తల్లి చూస్తున్నట్లు చూస్తున్నది. అందరూ దూరగా ఉండి నిలువెల్లా కంపిస్తూ చూస్తున్నారు. ఎవరికీ నోట మాటలేదు. ఏమి చేయాలో పాలుపోవడంలేదు. గుస గుస లాడుతున్నట్లు లోగొంతుకతో ' మాటేడు వేణు గోపాలుడి సేవ అయ్యిందా అమ్మా?' అన్నాడు సమర్ధ రాముడు కుశలప్రశ్నలు వేస్తున్నట్లు.

స్థంభాద్రి నుండి ఓరుగల్లు వెళ్ళే మార్గంలో ఉన్న కుగ్రామం మాటేడు. ఎంత పురాతనమైనదో తెలియని వేణుగోపాలుని మందిరం ఉన్నది అక్కడ! ఒక తెల్లని దివ్యసర్పం అక్కడ ఎల్లప్పుడూ కనిపిస్తుంది అని కథలుగా చెప్పుకుంటారు పరిసరాల పల్లెల ప్రజలు. సమర్ధరాముడి ప్రశ్న వినగానే తెరచాపలాంటి తెల్లని పడగను ముందుకు సాచింది. స్తంభాద్రి నృసింహుడి సేవకోసం వచ్చావా అమ్మా? అన్నాడు ఆయన మళ్ళీ.

నిదానంగా పడగను అలాగే ముందుకు సాచి నెమ్మదిగా ఆయన నుదురును తాకింది పడగతో. ముద్దు పెట్టినట్లు. ముద్దుగా దీవనలు పెట్టినట్లు. ఆయన కదలికలు ఎవరి కనులకూ కనిపించలేదు. ఎప్పుడు జోడించాడో చేతులు, యిప్పుడు నమస్కార ముద్రలో ఉన్నాడు!

భయముతో కూడిన అరుపులు వెలువడ్డాయి కొన్ని గొంతుల నుండి. స్వామీ స్వామీ అని అల్లంత దూరము నుండి ఆందోళనగా అరుస్తున్నాడు కృష్ణరాయలు. దేవాలయ పరిచారక సిబ్బంది, మిగిలినవాళ్ళు ఆ మహాసర్పం పూర్తిగా బయటకు రాగానే భయంతో కేకలు పెడుతూ పారిపోయారు. ఈ సమయానికి పరుగులతో రొప్పుకుంటూ సగం మెట్లు దిగి కొండ కిందికి వెళ్ళిపోయారు! ఎప్పుడు వెళ్లిందో, రాతి ధ్వజస్తంభము మీదకు ఎక్కి చూస్తున్నది కొండముచ్చు రాంబోలా. అది చాలా ప్రశాంతంగా ఉంది!

అర్చకస్వామి ధ్వజస్తంభం దాకా వెళ్ళిపోయాడు ఎప్పుడో! ఆయన స్వరం యిప్పుడు కంపించడంలేదు. 'ఆస్తీక! ఆస్తీక!' అన్న పలుకులకు బదులుగా స్పష్టంగా లయబద్ధంగా స్వరయుక్తంగా ఒక మంత్రాన్ని ఉచ్చారిస్తున్నాడు ఆయన!

'జరత్కారుర్జగద్గౌరీ! మానసా! సిద్ధ యోగినీ! వైష్ణవీ! నాగభగినీ! శైవీ! నాగేశ్వరీ తథా జరత్కారుప్రియాస్తీకమాతా! విషహారేతిచ మహాజ్ఞానయుతాచైవ సా దేవీ విశ్వపూజితా!' అనే పన్నెండు నామాల దివ్య మంత్రాన్ని ఉచ్చరిస్తూ తడబడకుండా సమర్ధరాముడి వైపు అడుగులేస్తున్నాడు యిప్పుడు. చేయిసాచి అందుకునే సమీపానికి వెళ్లి కనులు మూసుకుని నిశ్చలంగా ఉండిపోయాడు. శ్వేత చంపక వర్ణాభాం రత్నభూషణ భూషితాం అని మొదలయ్యే దివ్యధ్యానమంత్రం వెలువడింది ఆయన నోటివెంట. వెంటనే 'ఓం' తో మొదలయ్యే ఐదు బీజాక్షరాలతో కూడిన 'స్వాహా'కారంతో ముగిసే దివ్యమంత్రాన్ని ఉచ్చరించడం మొదలెట్టాడు.

పాఠకుడా! జనమేజయుడి సర్పయాగాన్ని ఆపి నాగజాతికి మహోపకారం చేసిన ఆస్తీకుడి పేరును ఉచ్చరిస్తే సర్పాలు తొలిగి దారినిస్థాయి. ఆస్తీకుడి తల్లి, నాగమాత జరత్కారువు. సాక్షాత్తూ లక్ష్మీ అంశ! ఆమె పన్నెండు నామాలను పూజాసమయంలో పఠించినవారికీ, విన్నవారికీ నాగమాత అనుగ్రహం లభిస్తుంది. స్తోత్రఫలం సిద్ధించిన వారికీ, వారి వంశము వారికీ పాములపుట్టమీద పడుకున్నా సర్పభయం ఉండదు. ఎంతటి విషాన్నైనా జీర్ణించుకోగలరు. పాములను పూలమాలల లాగా అలంకరించుకోగలరు. ధ్యానశ్లోక మంత్రంతో, బీజాక్షరయుతమైన మానసాదేవి మూలమంత్రాన్ని సిద్ధించుకున్నవాడు కాలసర్పవిషాన్నికూడా అమృతాన్ని తాగినట్లు తాగ గలుగుతాడు. ఆ దివ్యమంత్రాలనే అర్చకస్వామి ఆశ్రయించాడు యిప్పుడు.

షుమారు అరఘడియపాటు ఆ మంత్రోచ్చారణ జరుగుతూనే ఉన్నది. రెండుచేతులూ జోడించి ప్రశాంతంగా చూస్తూనే ఉన్నాడు సమర్ధరాముడు. ఆయన నుదురుకు పడగను తాకించి అలానే ఉన్నది ఆ మహాసర్పం. ధ్వజస్థంభము మీదనుండి శ్రద్ధగా కుతూహలంగా చూస్తూనే ఉన్నది వానరం. అరుపులు ఆపి నిర్ఘాంతపోయి చూస్తూనే ఉన్నాడు కృష్ణరాయలు.

నెమ్మదిగా పడగను దించి సింహాద్వారంగుండా ఆలయంలోకి వెళ్ళడం మొదలు పెట్టింది. ఆ దివ్యసర్పం. దానితోపాటే కర్పూరపు పరిమళం క్రమంగా దూరమవుతున్నట్లు తెలుస్తూనే ఉన్నది. ఆ వెనుక అనుసరిస్తున్నట్లుగా కదిలాడు అర్చకస్వామి. అప్పుడు కనులు తెరిచిన సమర్ధరాముడు ఆయనను అనుసరించాడు. సమర్ధరాముడి విల్లంబులతో ధ్వజస్థంభము వద్దనే నిలబడి చూస్తున్నాడు కృష్ణరాయలు. ఆ దివ్యసర్పం సమర్ధరాముడికి నృసింహుడి దర్శనానికి అనుజ్ఞనిచ్చి లోపలకు తోడ్కొళ్ళినట్లు తోచిందికృష్ణరాయలకు.

గుడిలోనుండి మధురంగా గంటమోగిన ధ్వని వినిపించింది. 'ఉగ్రం వీరం మహావిష్ణుం' అంటూ నృసింహ దివ్యమంత్రం వినిపించడం మొదలయ్యింది! ధ్వజస్తంభం మీద కొండముచ్చు సంతోషంగా కిచకిచలాడింది!

(కొనసాగింపు వచ్చే సంచికలో..)

COMMENTS